క్లుప్తంగా

కైకలూరు పోలీసులకు అభినందనలు



బహుమతులు అందిస్తున్న ఎస్పీ మేరిప్రశాంతి

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుల్లో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ డి.మేరి ప్రశాంతి ప్రత్యేకంగా అభినందించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్సై డి.వెంకటకుమార్, హెడ్‌కానిస్టేబుల్ టి.శంకరరావు, కానిస్టేబుల్ నాగబాబులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలోనూ, కేసులను ఛేదించడంలో ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు.

అమర వీరుల ఆశయాలను సాధిద్దాం



మాట్లాడుతున్న సీపీఎం నేత కిషోర్

ఏలూరు (టూటౌన్): కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తూ అమరులైన వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికిచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అన్నారు. స్థానిక చేపల తూము సెంటర్, మున్సిపల్ మార్కెట్ వద్ద సీపీఎం అమరజీవుల వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. అమర జీవుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. సీపీఎం ఏలూరు మాజీ కార్యదర్శిగా, మాజీ కౌన్సిలర్‌గా పనిచేసిన లావేటి అప్పలస్వామి ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించాలని కిషోర్ గుర్తుచేశారు. మున్సిపల్, చుట్టల కార్మికులు తదితర ప్రజా సమస్యలపై పోరాడారని తెలిపారు. ఇదే ప్రాంతానికి చెందిన బాంతిపర అప్పారావు పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల కోసం పోరాడారని చెప్పారు. కొల్లిపర వెంకటేశ్వరరావు, చింతాడ కోటేశ్వరరావు, తాన రంగారావు తదితరులు తుది శ్వాస వరకు సీపీఎం సభ్యులుగా కొనసాగారని గుర్తుచేశారు. సభలో నగర కమిటీ సభ్యులు కంది విశ్వనాధం, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వీవీఎస్ ప్రసాద్, చింతాడ వెంకటలక్ష్మి, మంచి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల మోత, అధిక ధరలకే పుస్తకాలు

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నిర్వాకం
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
- అధికారుల ఉదాసీనత
- ఏలూరులో 94 ప్రైవేట్ పాఠశాలలు
- 30,000 మంది విద్యార్థులు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): నూతన విద్యా సంవత్సరం 2024–25 ప్రారంభమైంది. పేద, దిగువ మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించగా, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించిన మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, ఉన్నత వర్గాల ప్రజలకు ఫీజుల మోత తప్పడంలేదు. అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొంది. నర్సరీ విద్యకు ఫీజులు, పుస్తకాలు ఇతరత్రా ఖర్చులుగా కనీసం రూ.35 వేలు నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అంతంత మాత్రంగా ఉండడంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు తమను దోపిడీ చేస్తున్నాయని వాపోతున్నారు.

దోపిడీకి మార్గాలెన్నెన్నో..

తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని కార్పొరేట్ విద్యా సంస్థలు అనేక మార్గాల్లో వారిని దోపిడీ చేస్తున్నాయి. విద్యా సంస్థ స్థాయిని బట్టి ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు రూ.15 నుంచి రూ.25 వేలు, 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు రూ.25 నుంచి రూ.40 వేలు వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు రూ.35 నుంచి రూ.50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. పుస్తకాలకు 1 నుంచి 5వ తరగతి వరకు రూ.6 వేలు నుంచి రూ.8 వేలు వరకు, ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.8 వేలు నుంచి రూ.10 వేలు వరకు వసూలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో వాటి ధర సగానికి సగం తక్కువైనా తమ వద్దే కొనాలనే నిబంధన విధిస్తున్నాయి. యూనిఫాం 3 జతలకు రూ.1500 నుంచి రూ.2 వేలు వరకు, షూ, టై, బెల్టు, బ్యాడ్జీ, ఐటీ కార్డుల పేరిట మరో రూ.2 వేలు వరకు వసూలు చేస్తున్నాయి. కాగా ఒకే ఇంటిలో ఇద్దరు పిల్లలు ఉంటే పెద్దవాడు చదివిన తరగతికి తరువాత ఏడాది చిన్నవాడు వస్తే ఆ విద్యార్థి పుస్తకాలు చిన్నవాడికి సరిపోతాయి. అయినా ఆ పుస్తకాలు వాడకూడదని, మళ్లీ పుస్తకాలు కొనాలంటూ డబుల్ దోపిడీకి పాల్పడుతున్నాయి.

అధికారుల ఉదాసీనత

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టడానికి చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు వసూళ్లు, పుస్తకాల దోపిడీ, ఇతర విద్యా వస్తువుల అమ్మకాలను నియంత్రించాల్సిన అధికారులు వారిచ్చే మామూళ్లకు అలవాటుపడి అసలు వాటివైపే దృష్టి సారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రతి విద్యా సంవత్సరంలో ఇలాంటి ఆరోపణలు వస్తున్నా విద్యాశాఖ అధికారుల్లో ఎటువంటి చలనం కనిపించడంలేదు. నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు అన్న చందంగా తల్లిదండ్రులు అధిక ఫీజులు, పుస్తకాలు, ఇతర విద్యా విషయక వస్తువుల విక్రయాలపై ఫిర్యాదు చేస్తే అధికారులు నామమాత్రంగా ఆయా పాఠశాలలను సందర్శిస్తున్నారని, వారికే క్లీన్‌చిట్ ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు మాత్రం యాజమాన్యాల దోపిడీకి సహకరిస్తూనే ఉన్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

94 ప్రైవేట్ పాఠశాలలు

ఏలూరు నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 94 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో అర్బన్ ప్రాంతంలో 66 పాఠశాలలు ఉండగా, వాటిలో గత ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు 22504 మంది నమోదయ్యారు. ఏలూరు గ్రామీణప్రాంతంలో 28 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా వాటిలో 7,365 మంది విద్యార్థులు నమోదయ్యారు.

యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. యూనిఫాం, పుస్తకాలు పేరిట మరో విధంగా దోపిడీ చేస్తున్నారు. ఇటువంటి విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. వసూలు చేసే ఫీజులు, ఇతర అంశాలను నోటీసు బోర్డులో ప్రదర్శించడంలేదు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ఫీజులు వసూలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాకి నాని, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

అభివృద్ధి పనుల పరిశీలన



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో పలు అభివృద్ధి పనుల ప్రగతిపై ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి), మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి పలు ప్రాంతాల్లో పర్యవేక్షించారు. ఏలూరు కృష్ణాకాలువపై వంగాయగూడెం నుంచి మినీబైపాస్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ పంపుల చెరువు వద్ద నిర్మించే బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని, అధికారులు రూపొందించిన మ్యాప్‌ను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరంలో పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటారు. నగరంలో పలు ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల పునరుద్దరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, చోడే వెంకటరత్నంనాయుడు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

విద్యా ప్రవేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు



దీక్షా యాప్ గూర్చి వివరిస్తున్న ఎంఈఓలు

ఏలూరు రూరల్ : దీక్షా యాప్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాన్ని నమోదు చేయాలని ఎంఈఓ రవిప్రకాష్ అన్నారు. గురువారం ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన విద్యా ప్రవేశం విజయవంతం చేయాలన్నారు. గత ఐదేళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, అభివృద్ధి తదితర విషయాలను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ నెల 30వ తేదీలోపు యాప్‌లో అప్‌లోడ్ పూర్తి చేయాలన్నారు. దీంతో భవిషత్తులో బాలబాలికల పూర్తి సమాచారం యాప్‌లో అందరికీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఎంఈఓ–2 ఆర్ రంగయ్య మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, బూట్లు, బ్యాగ్ తదితర వస్తువులు అందరికీ అందజేయాలని అన్నారు. ఏఎంఓ రామారావు, యాప్ జిల్లా నోడల్ అధికారి శ్రీహరి యాప్ అప్‌లోడ్ వివరాలను ఉపాధ్యాయులకు వివరించారు. సమావేశంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎంలు హాజరయ్యారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా నినదిస్తున్న విద్యార్థులు, అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే వర్షాకాలంలో వచ్చే జ్వరాలు, అతిసార (డయేరియా) వంటి అంటువ్యాధుల బారినపడకుండా ఉంటారని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. స్థానిక అగ్రహారంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మలేరియా వ్యతిరేక మాసోత్సవ, నీళ్ల విరోచనాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. వివిధ అంశాలపై గోవిందరావు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వర్షపు నీరు ఎక్కువగా ఎక్కడ బడితే అక్కడ నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది వాటి ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, వైరల్ ఫీవర్స్ వస్తాయన్నారు. నీరు కలుషితం వల్ల డయేరియా, టైఫాయిడ్, కామెర్లు మొదలగు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితిని నివారించాలంటే పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమన్నారు. దోమలు పెరిగే నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, మూతల్లేని నూతులు, పూల కుండీలు రుబ్బురోలు, ఫ్లవర్ వాజ్, ఎయిర్ కూలర్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకొని, మూతలు పట్టుకోవాలని సూచించారు. పనికిరాని వస్తువులైన టైర్లు, వాడేసిన కొబ్బరి బొండాలు పగిలిపోయిన ప్లాస్టిక్, ఇతర వస్తువులను విసర్జించాలని, ఫ్రైడేని డ్రైడేగా ఆచరించాలని అన్నారు. డయేరియా, టైఫాయిడ్, కామెర్లు మొదలు వ్యాధులు దరిచేరకుండా వ్యక్తిగత పరిశుభ్రత భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనారోగ్యానికి గురైతే అశ్రద్ధ చేయకుండా స్థానిక ఆరోగ్య, ఆశ కార్యకర్త లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవగాహన నినాదాలు చేయించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు ఆరోగ్య కార్యకరలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	44
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	30
ఏలూరు – బీహెచ్ఈఎల్	21,.15	4822	32
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.10	98503	00
ఏలూరు – తిరుపతి	16.00	4830	13

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05, 07
బెండకాయలు	30	కంద	64
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	44–52	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	116
బీరకాయలు (పందిరి)	64	అల్లం	180
క్యాబేజీ	34–38	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34–52	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	60	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	100
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	54

మెరుగైన చికిత్స అందించాలి



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు టౌన్: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, బొలేరో వాహనం ఢీకొని పలువురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఏలూరు సర్వజనాసుపత్రికి తరలించారు. దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామానికి చెందిన కూచిపూడి అర్జున్, ఉప్పాటి శ్యామ్‌బాబు అనే ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న నల్లజర్ల ఎస్సై దుర్గాప్రసాద్ క్షతగాత్రులను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో బాధితులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు. వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఖర్చులు, పన్నుల వసూళ్లపై సమాచారం ఇవ్వండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోవిడ్ సమయంలో ఏలూరు నగరపాలక సంస్థ పెట్టిన ఖర్చులు, గత ఐదేళ్లలో సంస్థ పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తం తాలూకు వివరాలు సమర్పించాలని సమాచార హక్కు చట్టం ప్రకారం కోరుతూ నగర కమిషనర్‌కు దరఖాస్తు చేసినట్టు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫక్షరం చైర్మన్ గంటా స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్ 19 సమయంలో 2020 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2021 ఆగష్టు 31 వరకు పారిశుధ్యం, రవాణా, ప్రజలకు ఆహారం, వైద్య పరికరాల నిమిత్తం కార్పొరేషన్ పెట్టిన ఖర్చుల వివరాలను తెలపాలని కోరామన్నారు. 2021 ఆగష్టు 1 నుంచి 2024 మార్చి 31 వరకు ప్రజల నుంచి గృహ, ఖాళీ స్థలాలపై, నీటి కుళాయిలపై వసూలు చేసిన పన్నుల వివరాలను, 2021 ఆగష్టు 1 నుంచి 2024 మార్చి 31 వరకు పారిశుధ్యం, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం కార్పొరేషన్ చేసిన ఖర్చుల వివరాలను తెలపాలని సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేశామని పేర్కొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 330 సీట్లు ఖాళీ

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామంలో ఉన్న నియోజకవర్గ స్థాయి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 330 సీట్లు ఖాళీగా ఉన్నాయని హాస్టల్ ఏఓ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వసతి సౌకర్యం ఉంటుందన్నారు.

త్వరలో గుడివాకలంకలో సర్పంచ్ ఎన్నిక !

ఏలూరు రూరల్ : త్వరలో కొల్లేరు గ్రామం గుడివాకలంకలో సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు ప్రకటించారు. ఇదేంటి సర్పంచ్ ఎన్నికలు అధికారులు నిర్వహించాలి కదా అనుకుంటున్నారా. ఇక్కడంతే.. కొల్లేరు కట్టుబాట్లు పేరుతో గ్రామ పెద్దలే సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. అయితే ఇవి అనధికార ఎన్నికలు. కాని గెలిచిన వ్యక్తి సర్పంచ్‌లా వ్యవహరిస్తూ అధికారాలు చలాయిస్తాడు. ఆశ్చర్యంగా ఉంది కదూ. వివరాల్లోకి వెళితే.. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామ పెద్దలు, బంటా పెద్దలు వైఎస్సార్ సీపీ నాయకుడు జయమంగళ రామారావు భార్య ప్రభావతిని బలపరిచారు. ఫలితంగా ఆమె సర్పంచ్‌గా గెలుపొందారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో ఆమె జిల్లా పంచాయతీ అధికారులను కలిసి తన సర్పంచ్ పదవికి రాజీనామా పత్రం అందజేశారు. ఆమె రాజీనామను ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదు. ఈలోగా గ్రామంలో కొందరు పచ్చనేతలు గ్రామంపై పట్టు సాధించేందుకు అనధికార సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని పెద్దలను డిమాండ్ చేశారు. దీంతో పెద్దలు గురువారం గ్రామసభ నిర్వహించారు. టీడీపీ గ్రామ నాయకులు ఘంటసాల నాగరాజు, జయమంగళ దొరబాబు సర్పంచ్ పదవికి పోటీపడ్డారు. దీంతో పెద్దలు త్వరలో ఎన్నిక నిర్వహిస్తామని ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కొల్లేరు గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహించే సర్పంచ్ ఎన్నికలకు ముందు గ్రామ పెద్దలు ప్రజల కలిసి ఏకగ్రీవంగా ఒక వ్యక్తిని ఎన్నుకుంటారు. తర్వాత ఆ వ్యక్తి మాత్రమే నామినేషన్ వేస్తాడు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికౌతాడు. కొల్లేరు గ్రామాల్లో కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఒకవేళ ఎవరైనా నామినేషన్ వేస్తే, ప్రజలు అందరూ కలిసి బలపరిచిన వ్యక్తినే భారీ మెజారిటీతో ఎన్నుకుంటారు.

మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



దెందులూరు డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

దెందులూరు: దోసపాడు గ్రామంలో చనిపోయిన పేదలకు మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దోసపాడు పేదలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను వెంటనే అమలు చేయాలని అసైన్‌మెంట్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని, పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని ఎంతో కాలంగా ఆందోళనలు, పోరాటాలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎట్టకేలకు జిల్లా జాయింట్ కలెక్టర్, కోర్టు అసలైన అసైన్డ్‌దారులకు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని తాత్సారం చేయకుండా మండల రెవెన్యూ అధికారులు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని, మరణించిన వారికి మరణ ధ్రువీకరణపత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు.

ఛటర్జీ సేవలు చిరస్మరణీయం

భీమడోలు: స్వాతంత్ర్య సమరంలో బెంగాలీ కవి బకించంద్ర ఛటోపాధ్యాయ (ఛటర్జీ) చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు చెప్పారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గురువారం సాయంత్రం గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వందేమాతర గీతం రచయిత బకించంద్ర ఛటర్జీ 186వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, పాఠకులు ఆయనను స్మరించుకొని, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వందేమాతర గేయాన్ని వారంతా అలపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ ఛటర్జీ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పి.సంపదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుష్పమణి

ఏలూరు (మెట్రో): జిల్లాలో వరదలు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సంసిద్ధతపై సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఆర్వో డి.పుష్పమణి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశం హాలులో గురువారం ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సంసిద్ధతపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ, ఆర్డీఓలు ఎన్ఎస్‌కే ఖాజావలి, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, వివిధ శాఖల అధికారులతో కలిసి డీఆర్వో సమీక్షించారు. జిల్లాలో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, తదితర మండలాల్లోని గోదావరి పరివాహక గ్రామాలు వరదలు, తుపాన్ల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, ఆ సమయంలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదలు సంభవించే ప్రాంతాలను గుర్తించడం, ప్రజల సురక్షిత ప్రాంతాలకు తరలింపు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, భోజన, వసతి సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య కేంద్రాలు తదితర ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలన్నారు. ముందుగానే నిత్యావసరాలను ఆయా మండల కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాలలో నది గట్లు పటిష్టతను పరిశీలించి, బలహీనమైన గట్లను వెంటనే పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లైఫ్ జాకెట్లు, లైఫ్ బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. గత రెండేళ్లలో పటిష్టమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న కారణంగా జిల్లాలో వరదలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టాలు జరగలేదని, అదే స్ఫూర్తితో అధికారులు, సిబ్బంది పనిచేయాలని డీఆర్వో సూచించారు. జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శర్మిష్ఠ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ ఇంజినీర్లు సత్యనారాయణ, జాన్ మోషే, పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు, వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా పాల్గొన్నారు.